www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 121 | హైదరాబాద్ | ఆదివారం | 20-07-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## రాజగోపాల్ రెడ్డి మాటలన్నీ ఉత్తవే

**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:** మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆయన సోదరుడు రాజగోపాల్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శలు గుప్పించారు. వెంకట్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వాళ్లవి అన్ని బ్లాక్ మెయిల్ స్టేట్ మెంట్లే ఉంటాయన్నారు. ఒక మాట అని వెంటనే కాంప్రమైజ్ అవుతారని అన్నారు. రేవంత్ రెడ్డి పీసీసీ పదవిని కొనుక్కున్నారని వాళ్లిద్దరే అన్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేయను అని రాజగోపాల్ రెడ్డి వెళ్లిపోయాడని మళ్లీ అదే పార్టీలోకి వెళ్లాడని విమర్శించారు.

పెద్ద మొనగాళ్లం అని చెప్పుకుంటారని రాజగోపాల్ రెడ్డి మాటలన్నీ ఉత్తవే అని నమ్మితే అమాయకత్వమే అని అన్నారు. రాజగోపాల్ రెడ్డి మాటలు నమ్మితే వాళ్లు అమాయకులే అని ఎద్దేవా చేశారు. రాజగోపాల్ రెడ్డికి అంత దమ్మే ఉంటే ఆయనతో పార్టీలో నుండి బయటకు వచ్చే నేతలను కూడగట్టాలని అన్నారు. రేవంత్ రెడ్డి మాటలను ఖండించేవాళ్లు ఎంతమందో తనతో కలిసి రావాలని చెప్పాలన్నారు. కానీ వాళ్ల వెంట ఎవరూ రారని, ఎందుకంటే వాళ్లే మాటపై నిలబడరని ఎద్దేవా చేశారు.



నాకు స్ట్రెయిట్ ఫైట్ తప్పా...

## స్ట్రీట్ ఫైట్ రాదు

మీదికి ఒక మాట.. లోపల ఒక మాట మాట్లాడటం రాదు

కాలం చాలా గొప్పది

బాజప్తా మాట్లాడతా.. బేజాప్తా మాట్లాడటం రాదు

హుజురాబాద్ చైతన్యానికి మారుపేరు : ఈటల



3

## 'జై తెలంగాణ' అనని సీఎం పాలన ఇది..

- గంభీరావుపేటలో జయశంకర్ విగ్రహ గద్దె కూల్చివేత
- అనుమతులు లేవంటూ కూల్చివేసిన అధికారులు
- గద్దెను కూల్చివేయడం దారుణమన్న కవిత



కేటీఆర్‌కు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్..

## చర్చకు సిద్ధమా..?

- కేటీఆర్ కంటే గట్టిగా తిట్టగలుగుతా
- కేదర్ కి మాకు సంబంధం లేదు అంటున్నాడు
- కేదర్ కి డ్రివెన్ కంపెనీ ఉంది... మీ బామ్మర్ది రాజ్ పాకాల వాడే కార్ కేదర్ కంపెనీ పేరుతో ఉంది
- సంబంధమే లేకుంటే కేదార్ కంపెనీ కార్ ఎందుకు వాడుతున్నాడు : బల్మూరి వెంకట్




2

## 150 ఎంబీబీఎస్ సీట్లు గోవిందా!

వరంగల్ ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ షాక్!

ఈ ఏడాది ఎంబీబీఎస్ అడ్మిషన్లకు అనుమతి నిరాకరణ

రెన్యువల్ కోసం లంచం ఇచ్చినట్లు సీబీఐ కేసుతో చర్యలు



2

## 42 దేశాలు తిరిగొచ్చారు కానీ, ఇంతవరకు మణిపూర్ కు వెళ్లలేదు: ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్

- మణిపూర్ లో కొంతకాలంగా హింస
- గిరిజన సమస్యలు, రాజకీయ అస్థిరత
- సొంత దేశంలో సమస్యలు పరిష్కరించాలని మోదీకి ఖర్గే హితవు



2

## ఓరుగల్లు 40 ఏళ్ల కల సాకారమైంది..

**ఓరుగల్లు అభివృద్ధికి 3 యూనిట్లు – కిషన్ రెడ్డి హామీ**

"మోడీ గ్యారంటీ తప్పకుండా నెరవేరుతుంది" – వరంగల్ ప్రాజెక్టుల వివరాలు

**ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ 2026లో ప్రారంభం – అశ్వినీ వైష్ణవ్**



3



# రీజనల్ కనెక్టివిటీ

## రింగ్ రైల్‌తో ఈజీ ట్రాన్స్‌పోర్టేషన్

- తెలంగాణకు మరో మణిహారం ..
- కేంద్రానికి ప్రభుత్వం ప్రతిపాదనలు
- గేమ్‌చేంజర్‌గా మారనున్న కొత్త రైలుమార్గం
- 10 జిల్లాలకు మెరుగుకానున్న రవాణా
- సరుకుల రవాణాకు సరికొత్త మార్గం
- వ్యవసాయ ఉత్పత్తుల తరలింపుకు ఊతం
- సికింద్రాబాద్ స్టేషన్‌పై తగ్గనున్న భారం
- శివారు పట్టణాలు, పారిశ్రామిక జోన్లలో అభివృద్ధి
- ఎక్కడా లేనటువంటి రవాణా తెలంగాణకు సొంతం
- ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్ మారే చాన్స్

3

## కల్తీని అరికట్టలేక కల్లుపై నిషేధమా?..

**కల్లు కల్తీ జరిగిన దుకాణాలు కాంగ్రెస్ నాయకులవే**

- మద్యం మాఫియాతో కాంగ్రెస్ సర్కార్ కుమ్మక్కు
- కమీషన్ల కక్కుర్తితో ప్రకృతి పానీయాన్ని విషం చేస్తున్నారు
- మా జోలికొస్తే వృత్తిదారులతో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక



2

## స్టాక్ మార్కెట్లో యూత్!

30 ఏళ్లలోపు పెట్టుబడిదారులు 39%

40 ఏళ్లలోపు వారు ఏకంగా 70 %

ఇన్వెస్టర్లలో నాలుగింట ఒకవంతు మహిళలు

మదుపర్లలో తెలుగు రాష్ట్రాల వాటా 7 %




2

## మన జలాలు తాకట్టుపెట్టి భారత రాష్ట్ర సమితిపై నిందలా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడిన కేటీఆర్

ఏపీ మంత్రి లోకేశ్‌ను తాను కలవలేదని వెల్లడి

మంత్రుల ఫోన్లను సీఎం ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపణ



3

## అన్యమతస్తులపై టీటీడీ వేటు...

**బండి సంజయ్ స్పందన**

- నలుగురు అన్యమత ఉద్యోగులపై టీటీడీ వేటు
- వారిని సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్న బండి సంజయ్
- పవిత్ర స్థలంలో ఇతర మతస్తులకు స్థానం లేదని వ్యాఖ్య



2

పదేళ్లు తానే సీఎం అని రేవంత్


## చెప్పడం సరికాదు

- రేవంత్ ప్రకటన పార్టీ విధానాలకు విరుద్ధంగా ఉందన్న రాజగోపాల్ రెడ్డి
- కాంగ్రెస్ లో ప్రజాస్వామ్యబద్ధంగా సీఎం ఎన్నిక ఉంటుందని వ్యాఖ్య
- చర్చనీయాంశంగా మారిన కోమటిరెడ్డి ట్వీట్



2

# స్టాక్ మార్కెట్లో యూత్!



- 30 ఏళ్లలోపు పెట్టుబడిదారులు 39%
- 40 ఏళ్లలోపు వారు ఏకంగా 70 %
- ఇన్వెస్టర్లలో నాలుగింట ఒకవంతు మహిళలు
- మదుపర్లలో తెలుగు రాష్ట్రాల వాటా 7 %

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

ఒకప్పుడు.. 'స్టాక్ మార్కెట్‌తో మాకేంటి సంబంధం?' అని సామాన్యుడు అనుకునేవాడు. కానీ, ఇప్పుడు అదే స్టాక్ మార్కెట్లో సామాన్యులు కూడా పెట్టుబడులు పెడుతున్నారు. ముఖ్యంగా, కోవిడ్, ఆ తరువాత జరిగిన అనేక పరిణామాలు.. ఇలా ఇందుకు కారణాలు అనేకం. ఫలితంగా ఇప్పుడు ఇన్వెస్టర్ల సంఖ్యలో ఏటా కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. దేశ జనాభాలో సుమారు 11.5 కోట్ల మంది జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టుబడులు పెట్టారు. వీరిలో 30 ఏళ్లలోపు వారు 39 శాతం కాగా.. మహిళలు సుమారు 25 శాతం కావడం గమనార్హం. తెలుగు రాష్ట్రాల్లోనూ మదుపరులు.. ముఖ్యంగా మహిళల సంఖ్య భారీగా పెరిగింది.

బిహార్.. దేశంలోనే అత్యల్ప తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) వేదికగా బిహార్ ఇన్వెస్టర్ల సంఖ్య అయిదేళ్లలో దేశంలోనే అత్యధికంగా 678 శాతం పెరిగింది. మదుపరుల సంఖ్య 7 లక్షల నుంచి 52 లక్షలకు దూసుకెళ్లింది. బిహార్‌లోనే ఇలా ఉంటే మరి ఇతర రాష్ట్రాల్లో? అవును.. ఇతర రాష్ట్రాల్లోనూ మదుపరులు గణనీయంగా పెరిగారు. ఎన్ఎస్ఈలో మదుపరుల సంఖ్య 2014-15లో 1,79,60,000. ఈ ఏడాది మే నాటికి అది ఏకంగా 11,49,42,000కు చేరింది. అంటే పదేళ్లలో 540 శాతం పెరుగుదల! 5-6 నెలలకే కొత్తగా కోటి మంది ఇన్వెస్టర్లు వచ్చి చేరుతున్నారంటే స్టాక్ మార్కెట్ పట్ల ఆసక్తి ఏ స్థాయిలో పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

**సులభమైన షేర్ల లావాదేవీలు!**

స్మార్ట్ ఫోన్ సామాన్యుడికి చేరువైంది. ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు సులువయ్యాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్ అంటే భయపడే రోజుల నుంచి.. ప్రతిరోజూ వేలూ, లక్షల రూపాయలను రకరకాల మార్గాల్లో పంపే పరిస్థితులు వచ్చాయి. డిజిటల్ అక్షరాస్యత గణనీయంగా పెరిగింది. మరోపక్క.. దేశీయ స్టాక్ మార్కెట్ కూడా రోజురోజుకూ కొత్త శిఖరాలను అధిరోహిస్తూ మదుపరులను ఊరిస్తోంది. తక్కువ సమయంలో, సులభమైన ఆదాయ మార్గంగా స్టాక్ మార్కెట్ అందరి దృష్టినీ ఆకర్షించింది. స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాలంటే ఒకప్పుడు దరఖాస్తు ప్రక్రియ చాలా సంక్లిష్టంగా ఉండేది.

ఏ కంపెనీని ఎంచుకోవాలో సమాచారం తెలిసేది కాదు. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు! షేర్ల కదలిక కళ్ల ముందు కనపడుతోంది. సామాన్యులు సైతం అతి తక్కువగా.. అంటే రూ.100 పెట్టుబడితో స్టాక్ మార్కెట్లో అడుగు పెట్టొచ్చు. పెట్టుబడి పెట్టడమే కాదు.. ఉపసంహరణ సైతం చాలా సులభం అయిపోయింది. ముఖ్యంగా రిటైల్ ట్రేడింగ్‌ను సులభతరం చేసే ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్ ఎన్నో వచ్చాయి. కోవిడ్ సమయంలో చాలామందికి ఇంటి దగ్గర ఉంటూ ఆదాయార్జన మార్గంగా స్టాక్ మార్కెట్‌ను ఎంపిక చేసుకున్నారు. ఇలాంటి అనేక అంశాలు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిదారుల సంఖ్య పెరగడానికి కారణమయ్యాయి.

పెరిగిన మహిళా శక్తి!..: స్టాక్ మార్కెట్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుండడం విశేషం. మహిళా ఇన్వెస్టర్ల వాటా 2022-23లో 22.5 శాతం కాగా ఈ ఏడాది మే నాటికి 24.4 శాతానికి చేరింది. గోవాలో అత్యధికంగా మహిళా పెట్టుబడిదారులు 32.6 శాతం ఉన్నారు. దేశంలో మొత్తం ఇన్వెస్టర్ల పరంగా మహిళా ఇన్వెస్టర్ల అత్యధికంగా ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. అక్కడ 28.4 శాతం ఉంటే , గుజరాత్‌లో 27.8 శాతం ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 23.4, తెలంగాణలో 24.9 శాతం మహిళలు ఉన్నారు.

ఆ మూడు రాష్ట్రాలు...: ఒక కోటి మంది ఇన్వెస్టర్ల క్లబ్‌లో చేరిన మూడో రాష్ట్రంగా గుజరాత్ అవతరించింది. 1.86 కోట్లతో మహారాష్ట్ర, 1.31 కోట్లతో ఉత్తరప్రదేశ్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రాంతాల వారీగా చూస్తే 4.2 కోట్లతో ఉత్తర భారత్ అగ్రస్థానంలో ఉంది. పశ్చిమ భారత్ 3.5 కోట్లు, దక్షిణాది 2.4 కోట్లు, తూర్పు భారత్‌లో 1.4 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉన్నారు. సంఖ్యా పరంగా ఏడాదిలో ఉత్తరాదిలో 24%, తూర్పు భారత్ 23%, దక్షిణాది 22%, పశ్చిమ భారత్‌లో 17% వృద్ధి నమోదైంది. మే నెలలో తోడైన కొత్త ఇన్వెస్టర్ల సంఖ్యలో దేశంలోని టాప్-10 జిల్లాల్లో రంగారెడ్డి (8), హైదరాబాద్ (10) చోటు దక్కించుకున్నాయి.

# అన్యమతస్తులపై టీటీడీ వేటు...



- బండి సంజయ్ స్పందన
- నలుగురు అన్యమత ఉద్యోగులపై టీటీడీ వేటు
- వారిని సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్న బండి సంజయ్
- పవిత్ర స్థలంలో ఇతర మతస్తులకు స్థానం లేదని వ్యాఖ్య

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

అన్యమతాలకు చెందిన నలుగురు ఉద్యోగులను టీటీడీ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. టీటీడీలో పనిచేస్తూ క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నట్టు విజిలెన్స్ విభాగం ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్లపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు.

ఎక్స్ వేదికగా బండి సంజయ్ స్పందిస్తూ... తమ డిమాండ్ మేరకు అన్యమతాలకు చెందిన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇది ప్రారంభం మాత్రమేనని... ఇప్పటికీ తిరుమలలో హిందువులు కానివారు వందల మంది పనిచేస్తున్నారని అన్నారు. హిందువులు పవిత్రంగా భావించే అలాంటి స్థలంలో ఇతర మతస్తులకు స్థానం లేదని చెప్పారు. మిగిలిన అన్యమత ఉద్యోగులను కూడా వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

# పదేళ్లు తానే సీఎం అని రేవంత్ చెప్పడం సరికాదు



- రేవంత్ ప్రకటన పార్టీ విధానాలకు విరుద్ధంగా ఉందన్న రాజగోపాల్ రెడ్డి
- కాంగ్రెస్ లో ప్రజాస్వామ్యబద్ధంగా సీఎం ఎన్నిక ఉంటుందని వ్యాఖ్య
- చర్చనీయాంశంగా మారిన కోమటిరెడ్డి ట్వీట్

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. మరో పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఘాటుగా స్పందించారు.

ఎక్స్ వేదికగా రాజగోపాల్ రెడ్డి స్పందిస్తూ... రేవంత్ ప్రకటన పార్టీ విధానాలకు విరుద్ధంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుందని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సహించరని అన్నారు. రాజగోపాల్ ట్వీట్ చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవిని ఆశించి రాజగోపాల్ రెడ్డి భంగపడ్డారు. ఈ క్రమంలో ఆయన తొలిసారి ధిక్కారస్వరం వినిపించినట్టయింది.

# కల్తీని అరికట్టలేక
# కల్లుపై నిషేధమా?..



- కల్లు కల్తీ జరిగిన దుకాణాలు కాంగ్రెస్ నాయకులవే
- మద్యం మాఫియాతో కాంగ్రెస్ సర్కార్ కుమ్మక్కు
- కమీషన్ల కక్కుర్తితో ప్రకృతి పానీయాన్ని విషం చేస్తున్నారు
- మా జోలికొస్తే వృత్తిదారులతో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

కల్తీని అరికట్టడం చేతగాకే కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మందికి జీవనాధారమైన కల్లుపై నిషేధం విధించాలని యోచిస్తున్నదని బీఆర్ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆందోళన వ్యక్తంచేశారు. మద్యం మాఫియాకు తలొగ్గి కల్లును నిషేధిస్తే లక్షలాది మంది కల్లుగీత వృత్తిదారులతో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ పేరిట కల్లు వృత్తినే నిషేధించాలని చూస్తున్నారని, ఔటర్ రింగు రోడ్డు లోపలి దుకాణాలన్నింటినీ మూసివేస్తామంటూ సర్కార్ లీకులు ఇప్పిస్తున్నదని ధ్వజమెత్తారు. గతంలోనూ వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో కల్లుపై నిషేధం విధించారని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక గీత వృత్తిదారులను ఆదుకున్నదని తెలిపారు.

ఇటీవల కల్తీ జరిగిన కల్లు దుకాణం కాంగ్రెస్ కార్పొరేటర్‌దేనని, ముందుగా అతనిపై చర్యలు తీసుకోవాలని, కల్తీని నిరోధించడంలో విఫలమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మామూళ్ల మత్తులో కొందరు కల్తీని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఒక కల్లు కంపౌండ్‌లో 200 మందికి జీవనధారం దొరుకుతుందని, అదొక కుటీర పరిశ్రమగా కొనసాగుతున్నదని చెప్పారు. కల్లు నుంచి వైన్, వోడ్కా లాంటివి తయారు చేయవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారని, అలాంటి తరుణంలో ఈ ప్రకృతి పానీయమే లేకుండా చేయాలని పాలకులు చూస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీని వెనుక ఉన్నది మద్యం మాఫియా ఉన్నదని విమర్శించారు.

**లోపాయికారి ఒప్పందం**

డిస్టిలరీ కంపెనీ నుంచి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కల్లును పూర్తిగా బంద్ చేయిస్తే మద్యం సరఫరా పెరుగుతుందని, తద్వారా మరింత కమీషన్లు ఇస్తామని ఆయా కంపెనీలు సైతం ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. కర్నాటకలోనూ అదే జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కేవలం 11 లక్షల లీటర్లు ఇచ్చే ఆవులు, బర్రెలే ఉన్నాయని, కానీ నిత్యం 56 లక్షల లీటర్ల పాలు సరఫరా అవుతున్నాయని, కెమికల్స్, యూరియా వంటి రసాయనాలు కలిపి కల్తీ పాలను తయారు చేస్తున్నారని ఆరోపించారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, కేవలం 2 శాతం మంది సేవించే కల్లులో కల్తీ జరిగితే పూర్తిగా ఆ వ్యవస్థపై నిషేధం పెట్టాలని చూడటం ప్రభుత్వ అవివేకతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ గెలుపునకు జాతి ఓట్లు కూడా దోహదపడ్డాయని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. హైదరాబాద్‌లో కల్లును నిషేధిస్తే తమ పదవులను వదిలి బయటకు రావాలని స్పష్టంచేశారు. సమావేశంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్, తెలంగాణ గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్, బీసీ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ లీగల్ అడ్వయిజర్ ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, నవ సంఘర్షణ సమితి అధ్యక్షుడు పంజాల జైహింద్‌గౌడ్, బీసీ, గౌడ నేతలు మేకపోతుల నరేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్..
# చర్చకు సిద్ధమా..?



- కేటీఆర్ కంటే గట్టిగా తిట్టగలుగుతా
- కేదర్ కి మాకు సంబంధం లేదు అంటున్నాడు
- కేదర్ కి డ్రివెన్ కంపెనీ ఉంది... మీ బామ్మర్ది రాజ్ పాకాల వాడే కార్ కేదర్ కంపెనీ పేరుతో ఉంది
- సంబంధమే లేకుంటే కేదార్ కంపెనీ కార్ ఎందుకు వాడుతున్నాడు : బల్మూరి వెంకట్

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వివిధ ఆరోపణలు చేస్తూ కేటీఆర్‌ను బహిరంగ చర్చకు సవాల్ విసిరారు.

"కేటీఆర్ కంటే నేను గట్టిగా తిట్టగలుగుతా. కేదర్‌తో మాకు సంబంధం లేదంటున్నావు. కానీ కేదర్‌కి డ్రివెన్ కంపెనీ ఉంది. నీ బామ్మర్ది రాజ్ పాకాల వాడే కారు కేదర్ కంపెనీ పేరుతో ఉంది. సంబంధం లేకుంటే కేదర్ కంపెనీ కారును ఎందుకు వాడుతున్నాడు?" అని బల్మూరి వెంకట్ ప్రశ్నించారు.

అలాగే, "డ్రగ్స్ కేసులో కోర్టు చెప్పింది ఒకటి, నువ్వు వక్రీకరించింది ఇంకొకటి. ఇది కోర్టు ధిక్కరణ కిందకి వస్తుంది. 48 గంటల్లో క్షమాపణ చెప్పకపోతే కోర్టుకు వెళ్తా" అని హెచ్చరించారు.

బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, "డ్రగ్స్ టెస్టులో బయట పడకుండా డిటాక్స్ చేసుకుని వచ్చావు కేటీఆర్. మూడు నెలల క్రితం UK కి వెళ్లి చేసింది ఇదే. UK కి ఎందుకు వెళ్ళావు? ఏం టెస్టులు చేయించావు అని చెప్పు" అని నిలదీశారు.

కేదర్ మరణంపై మాట్లాడుతూ, "కేదర్ చనిపోయినప్పుడు మాజీ ఎమ్మెల్యేలు లేరా? సిఎం చెప్పింది అబద్ధమైతే, కేటీఆర్ నువ్వు లేఖ రాసి విచారణ కోరాలి. నేను కూడా సిఎంకి లేఖ రాస్తా. విచారణకి సిద్ధమా?" అని ప్రశ్నించారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కూడా బల్మూరి వెంకట్ సవాల్ చేశారు. "ఫోన్ ట్యాపింగ్ మేము చేయలేదు అంటున్నావు. కేటీఆర్, కేసీఆర్ - లై డిటెక్టర్ టెస్ట్ కి వస్తారా? బహిరంగ చర్చకు రా కేటీఆర్. నీ కంటే నా ప్రోటోకాల్ పెద్దది. నేను చెప్పిన అంశాలపై చర్చకు రావాలి. ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే 'ఎందిరా కేటీఆర్' అనాల్సి వస్తుంది. ఇవాళ్టి నుండి కేటీఆర్ ప్రవర్తన ఎలా ఉంటే, మా ప్రవర్తన అట్లానే ఉంటుంది" అని బల్మూరి వెంకట్ హెచ్చరించారు.

# 42 దేశాలు తిరిగొచ్చారు కానీ, ఇంతవరకు మణిపూర్ కు వెళ్లలేదు: ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్



- మణిపూర్ లో కొంతకాలంగా హింస
- గిరిజన సమస్యలు, రాజకీయ అస్థిరత
- సొంత దేశంలో సమస్యలు పరిష్కరించాలని మోదీకి ఖర్గే హితవు


**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 42 దేశాలను సందర్శించిన ప్రధాని మోదీ, అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మణిపూర్ రాష్ట్రాన్ని మాత్రం ఇప్పటివరకు సందర్శించలేకపోయారని ఎద్దేవా చేశారు. మణిపూర్‌లో గత కొంతకాలంగా హింసాత్మక సంఘటనలు, గిరిజన సమస్యలు, రాజకీయ అస్థిరతలు కొనసాగుతున్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దీనిపై తగిన శ్రద్ధ చూపడం లేదని ఆయన ఆరోపించారు. దేశ ప్రధానమంత్రిగా మోదీ సొంత దేశంలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, విదేశీ పర్యటనలపై దృష్టి సారించడం సరికాదని ఖర్గే వ్యాఖ్యానించారు.

మణిపూర్ సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని, రాష్ట్ర ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవడానికి మోదీ స్వయంగా రాష్ట్రాన్ని సందర్శించి, స్థానిక నాయకులతో చర్చించాలని ఆయన సూచించారు. మణిపూర్‌లో శాంతి, స్థిరత్వం తీసుకురావడానికి తక్షణ చర్యలు అవసరమని ఖర్గే పేర్కొన్నారు.

అంతేకాకుండా, రాజ్యాంగాన్ని మార్చే ఏ ప్రయత్నమైనా దేశ ప్రజల హక్కులను హరించే చర్యగా పరిగణించబడుతుందని ఖర్గే హెచ్చరించారు. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని, దానిని బలహీనపరిచే ఏ చర్యనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను కాపాడుతూ, దేశ ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# 150 ఎంబీబీఎస్ సీట్లు గోవిందా!



- వరంగల్ ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ షాక్!
- ఈ ఏడాది ఎంబీబీఎస్ అడ్మిషన్లకు అనుమతి నిరాకరణ
- రెన్యువల్ కోసం లంచం ఇచ్చినట్లు సీబీఐ కేసుతో చర్యలు

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

రెన్యువల్ కోసం లంచం ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వరంగల్‌లోని ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీ (ఎఫ్‌సీఐఎంఎస్)కి ఈ సంవత్సరం ఎంబీబీఎస్ అడ్మిషన్లలో షాక్ తగిలింది. త్వరలో ప్రారంభం కానున్న ఎంబీబీఎస్ అడ్మిషన్ల జాబితా నుంచి ఈ కళాశాలను జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తొలగించింది.

ఈ కాలేజీలో ఉన్న 150 ఎంబీబీఎస్ సీట్లను రెన్యువల్ చేయలేదు. దీంతో రాష్ట్రంలో ఈసారి 150 ఎంబీబీఎస్ సీట్లు తగ్గనున్నాయి. వైద్య కళాశాల రెన్యువల్ కోసం రూ.66 లక్షలు లంచంగా ఇచ్చినట్లు సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగాసీబీఐ నమోదుచేసిన కేసుల ఆధారంగా మొత్తం 3,000 మెడికల్ సీట్లను ఎన్ఎంసీ ఈసారి రెన్యువల్ చేయలేదు. అందులో తెలంగాణ నుంచి ఎఫ్‌సీఐఎంఎస్ ఒక్కటే ఉంది.

రెన్యూవల్ కోసం అడ్డదారులు: ఎఫ్‌సీఐఎంఎస్ 2023లోనే ప్రారంభమైంది. ఈ కళాశాలకు ట్రస్టీగా ఉన్న ఫాదర్ జోసఫ్ కొమ్మారెడ్డి.. కళాశాల రెన్యువల్ కోసం అక్రమాలకు పాల్పడినట్లు సీబీఐ గుర్తించింది. నకిలీ బోధకులు, అద్దె రోగులతో కళాశాల పరిధిలోని బోధనాసుపత్రిని నింపి అప్పటి అధికారులను మేనేజ్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. డాక్టర్ బి.హరిప్రసాద్ (కదిరి, ఏపీ), డాక్టర్ అంకం రాంబాబు (హైదరాబాద్), డాక్టర్ కృష్ణ కిషోర్ (విశాఖపట్నం) ద్వారా రెండు విడతల్లో రూ.66 లక్షలను ఎంసీఐ అధికారులకు లంచంగా ఇచ్చినట్లు సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

# 'జై తెలంగాణ' అనని సీఎం పాలన ఇది..

- గంభీరావుపేటలో జయశంకర్ విగ్రహ గద్దె కూల్చివేత
- అనుమతులు లేవంటూ కూల్చివేసిన అధికారులు
- గద్దెను కూల్చివేయడం దారుణమన్న కవిత

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, విద్యావేత్త, సామాజిక ఉద్యమకారుడు, ఆంధ్ర పాలకులతో పరోక్ష యుద్ధం చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌కు ఘోర పరాభవం ఎదురైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న జయశంకర్ విగ్రహ ఏర్పాటు గద్దెను అధికారులు నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. ఆగస్టు 6న ఆయన జయంతి రోజున అవిష్కరించాలని నమాజ్ చెరువు కట్ట శివారులో విగ్రహ ఏర్పాటు పనులను ప్రారంభించగా.. అందుకు ఎలాంటి పర్మిషన్లు లేవని ఇరిగేషన్ శాఖ అధికారులు గద్దెను జేసీబీతో నేలమట్టం చేశారు.

ఈ నేపథ్యంలోనే అధికారుల దుశ్చర్యపై తెలంగాణ జాగృతి వ్యవస్థపకురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'X' (ట్విట్టర్) వేదికగా ఆమె సంచలన ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని అన్నారు. నమాజ్ చెరువు కట్టపై జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను కూల్చివేయడం దారుణమని ఆక్షేపించారు. 'జై తెలంగాణ' అనని ముఖ్యమంత్రి పాలనలో తెలంగాణ మహనీయులకు ఇలాంటి అవమానాలు జరగడం మనసును కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గంభీరావుపేటలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని.. నిర్దాక్షిణ్యంగా గద్దెను కూల్చేసిన అధికారులపై కఠిన చర్యలను తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.



# మన జలాలు తాకట్టుపెట్టి భారత రాష్ట్ర సమితిపై నిందలా?

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడిన కేటీఆర్
- ఏపీ మంత్రి లోకేశ్‌ను తాను కలవలేదని వెల్లడి
- మంత్రుల ఫోన్లను సీఎం ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపణ



**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

బనకచర్లపై చర్చించాల్సి వస్తే ముఖ్యమంత్రుల భేటీకి వెళ్లనని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. దిల్లీకి వెళ్లి అదే చర్చలో పాల్గొన్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు సైతం ఎజెండాలో మొదటి అంశం అదే ఉందని చెబుతున్నారని.. తెలంగాణ జలాలు, ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెట్టి దొరికిపోవటంతోనే రేవంత్‌రెడ్డి భారత రాష్ట్ర సమితి నాయకులపై వదంతులు వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో శుక్రవారం పర్యటించిన కేటీఆర్ తొలుత సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావును కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్ పరామర్శించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'నేను జీవితంలో సిగరెట్ కూడా తాగలేదు. యువత మత్తుపదార్థాలకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాలకు దూరంగా ఉండాలి. ఆయన మాటలు రాష్ట్ర ప్రజల ప్రశాంతతకు హానికరం. గత 20 నెలల్లో కేసీఆర్ జపం చేయటం, రాజకీయాలు తప్ప రేవంత్ ప్రజలకు చేసిందేమీ లేదు. మాపై టన్నుల కొద్దీ కేసులు పెట్టినా.. గుండుపిన్నంత ఆధారాలూ చూపలేదు. సీఎంకు రచ్చ తెలుసుకాని చర్చ తెలియదు. దుబాయ్‌లో ఎవరో మరణిస్తే నాకు అంటగట్టడం ఏమిటి? డ్రగ్స్ అంశంపై 2021లో ఆధారాలు లేకున్నా మాట్లాడుతున్నారని కోర్టుకు వెళ్తే ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చారు.. దాన్ని స్టే అంటున్నారు.

**సీఎం సోదరుల భూదందాలు బయటపెడతాం..**

అర్ధరాత్రి నేను లోకేశ్‌ను కలవలేదు.. అయినా పక్క రాష్ట్రం మంత్రి, తమ్ముడు లాంటి వ్యక్తిని కలిస్తే తప్పేంటి? రేవంత్‌రెడ్డి సోదరుల భూ దందాలు బయటపెడతాం. కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టులో రూ.4వేల కోట్ల కాంట్రాక్ట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించారు. తన కుర్చీకి ఎసరు తెస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టితోపాటు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వేల మంది ఫోన్లను సీఎం రేవంత్‌రెడ్డి ట్యాప్ చేస్తున్నారు. గోదావరి నికర జలాల్లో 968 టీఎంసీలు, మిగులు జలాల్లో 1,950 టీఎంసీలు ఇచ్చి తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ చేసిన ఫిర్యాదులను ఉపసంహరించుకుంటే రాష్ట్రానికి న్యాయం జరుగుతుంది. కానీ అవేవి లేకుండానే గురుదక్షిణగా ఇస్తున్న బనకచర్లను వ్యతిరేకిస్తున్నాం. మంత్రివర్గంలో బీసీలకు 42 శాతం పదవులు ఇవ్వాలి. కేంద్రం పరిధిలోని రిజర్వేషన్లపై నాటకాలు మానుకోవాలి' అని కేటీఆర్ అన్నారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలలో చైతన్యం నింపుతూ సిద్దిపేటలో మేధావులు కలిసిన మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర నాయకులు కటకం నర్సింగ్

**దుబ్బాకసిద్దిపేట పవర్ న్యూస్ జూలై 19 ప్రతినిధి**

మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర నాయకులు కటకం నర్సింగ్ గ్రామపాటలో భాగంగా రెండో విడత లో భాగంగా ఆగస్టు మూడో తారీఖున జరిగేటువంటి గ్రామ జెండా కార్యక్రమానికి నర్సాపూర్ గజ్వేల్ సిద్దిపేటలో అనేకమంది కార్యకర్తలను శ్రేయోభిలాషులను కలుస్తూ బీసీలలో చైతన్యం తీసుకురావాలని అటువంటి ఆలోచనలు భాగంగా శనివారం నాడు సిద్దిపేటలో వారితో కుల సంఘాలతో మేధావులతో చాలామందితో మాట్లాడి ఆగస్టు మూడో తారీఖున జరిగేటువంటి జెండా కార్యక్రమంలో పాల్గొని బీసీలలో నిద్రాణమై ఉన్నటువంటి అచేతనమైనటువంటి ఒక ఆలోచనను చైతన్యంగా తీసుకొచ్చి సమాజాన్ని చేతనం చేసేటువంటి విధంగా తయారు కావాలని అందర్నీ ఆరోజు గ్రామ గ్రామాన జెండా ఎగరవేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిసె ప్రభు, లగిశెట్టి సాయి బాబా అడ్వకేట్, సుంచు శ్రీనివాస్ నేత, అంజి రజక, వడ్డేపల్లి దశరథ ,సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# అబాకస్ వేదిక్ మ్యాథ్స్ టీచర్ దోసల మురహరి జాతీయ అవార్డుకు ఎంపిక

- వేదిక్ మ్యాథ్స్ నైపుణ్యతలో మురారీ సేవలు అమోఘం.
- సెప్టెంబర్ 5న ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో జాతీయ అవార్డు అందుకోనున్న దోసల మురహరి.

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూలై 19 ప్రతినిధి**

డాక్టర్ అబ్దుల్ కలామ్ జాతీయ అవార్డుకు ఎంపికైన అబాకస్ వేదిక్ మ్యాథ్స్ ఉపాధ్యాయుడు దోసల మురహరి బి.ఎస్.ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ హైదరాబాదులోని బహుజన సాహిత్య అకాడమీజాతీయకార్యాలయంలో ఏ.పీ.జే అబ్దుల్ కలాం అవార్డు లెటర్ దోసల మురారికి అందజేశారు..ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఈజీగా లెక్కలు చెప్పడంలో. భయపడుతున్న విద్యార్థులకు, సులభంగా బోధిస్తున్న దోసల మురహరి గత 30 సంవత్సరాల నుండి అబాకస్ వేదిక్ మ్యాస్ పేద, మధ్యతరగతి విద్యార్థులలో నైపుణ్యత పెంపొందించడంకు ఆయన లక్ష్యమని అన్నారు. ఆయన అనేక జిల్లాలు తిరిగి ప్రభుత్వ కస్తూర్బాస్కూల్లో, కళాశాలలో , కలెక్టర్ తో ప్రభుత్వ అధికారులతో మన్ననలు పొందిన సరోజిని స్మార్ట్ లర్నింగ్ సమస్త అని కొనియాడారు. అబాకస్ తో మ్యాథమెటిక్స్ లెక్కలను సులభంగా చేయవచ్చును వారు అన్నారు. విద్యార్థులకు నైపుణ్యత పెంచే మ్యాథమెటిక్స్ భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత స్థానంలో ఎదుగుతారని అన్నారు. అబ్దుల్ కలాం శాస్త్రవేత్త ఎన్నో ప్రయోగాలు ఎన్నో ప్రయోగాలు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనార్టీ ల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడంకు బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతిఏటా ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతిలో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. సౌత్ ఇండియాలోని ఆరు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ తమిళనాడు, అండ్ పుదుచ్చేరి రాష్ట్రాల నుండి సుమారుగా 600 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్కు హాజరవుతారని తెలియజేశారు.ఈ అవార్డు ఎంపిక పత్రాన్ని అందజేసిన బి.ఎస్.ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమండ్ల విష్ణు, అవార్డ్ సెలక్షన్ కమిటీ సభ్యులు కుంభాల రవీందర్, లకు ఉపాధ్యాయుడు దోసల మురహరి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.




# రీజనల్ కనెక్టివిటీ

- రింగ్ రైల్‌తో ఈజీ ట్రాన్స్‌పోర్టేషన్
- తెలంగాణకు మరో మణిహారం ..
- కేంద్రానికి ప్రభుత్వం ప్రతిపాదనలు
- గేమ్‌చేంజర్‌గా మారనున్న కొత్త రైలుమార్గం
- 10 జిల్లాలకు మెరుగుకానున్న రవాణా
- సరుకుల రవాణాకు సరికొత్త మార్గం
- వ్యవసాయ ఉత్పత్తుల తరలింపుకు ఊతం
- సికింద్రాబాద్ స్టేసన్‌పై తగ్గనున్న భారం
- శివారు పట్టణాలు, పారిశ్రామిక జోన్లలో అభివృద్ధి
- ఎక్కడా లేనటువంటి రవాణా తెలంగాణకు సొంతం
- ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్ మారే చాన్స్

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**

కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక.. ప్రధాని మోదీ సర్కారు రహదారులు, రైలు మార్గాల విస్తరణ, రవాణా సౌకర్యం మెరుగుకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో అనేక జాతీయ రహదారులను కేంద్రం నిర్మిస్తోంది. ఇంకా నిర్మాణంలో అనేక రహదారులున్నాయి. ఇక.. రైలు మార్గాల విస్తరణ కూడా వేగవంతంగా కొనసాగుతోంది. తెలంగాణలో కూడా రహదారులు, రైలు మార్గాల విస్తరణ జరుగుతోంది. తాజాగా. హైదరాబాద్ చుట్టూ రింగ్ రైలు మార్గాన్ని నిర్మించే ప్రాజెక్టు తెరమీదకు వచ్చింది. దేశంలోనే మొట్టమొదటి రకం ప్రయత్నంగా ఇది గుర్తింపు పొందింది. ఇటీవల పూర్తయిన ఫైనల్ లొకేషన్ సర్వేతో, ఈ ప్రాజెక్టు దిశగా కీలక అడుగు పడింది. సికింద్రాబాద్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లే ఆరు రైలు మార్గాలతో రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టు అనుసంధానం కానుంది. ఈ సరికొత్త ప్రాజెక్టుతో రాష్ట్ర రవాణా వ్యవస్థను విప్లవాత్మకంగా మార్చనుంది.

**అసలేంటీ రింగ్ రైలు ప్రాజెక్టు?**

హైదరాబాద్ చుట్టూ నిర్మించే ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు రాష్ట్ర రవాణా వ్యవస్థను మార్చివేయనున్న ఒక గేమ్‌చేంజర్. 536564 కిలోమీటర్ల పొడవైన రైలు మార్గం, సికింద్రాబాద్ నుంచి విజయవాడ, గుంటూరు, వరంగల్, నిజామాబాద్, మెదక్, ముంబై, వికారాబాద్ వంటి ఆరు కీలక రైలు మార్గాలతో అనుసంధానం కానుంది. దేశంలోనే మొట్టమొదటి రింగ్ రైలు ప్రాజెక్టుగా, ఇది హైదరాబాద్‌లోని ప్రధాన రైల్వే స్టేషన్లపై ఒత్తిడిని తగ్గించడంతో



పాటు, చుట్టుపక్కల జిల్లాలకు సమర్థవంతమైన కనెక్టివిటీని అందిస్తుంది.

**ప్రాంతీయ అనుసంధానం..**

ఈ ప్రాజెక్టు 810 జిల్లాలను (మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రిభువనగిరి, సిద్దిపేట, జనగామ, కామారెడ్డి) కలుపుతూ, కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణంతో ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేస్తుంది. ఇది స్థానిక వ్యవసాయ, వ్యాపార, విద్య, ఆరోగ్య, పర్యాటక రంగాలను బలపరుస్తుంది, వరి, మొక్కజొన్న, పత్తి, పసుపు వంటి వ్యవసాయ దిగుబడులకు మార్కెటింగ్‌కు ఊతమిచ్చే అవకాశం ఉంది. ఈ రైలు మార్గం ప్రధానంగా గూడ్స్ రైళ్లను సికింద్రాబాద్, హైదరాబాద్, నాంపల్లి స్టేషన్ల గుండా వెళ్లకుండా ఇతర రూట్లలోకి మళ్లించడానికి వీలు కల్పిస్తుంది. దీనివల్ల ఈ స్టేషన్లపై ఒత్తిడి తగ్గి, సరుకు రవాణా సమర్థత పెరుగుతుంది. సిమెంట్, క్లింకర్ వంటి పరిశ్రమలకు ఈ మార్గం ఒక వరంగా మారనుంది.

**మూడు ఎలైన్‌మెంట్లతో ఆప్షన్లు..**

దక్షిణ మధ్య రైల్వే మూడు ఎలైన్మెంట్ ఆప్షన్లను ప్రతిపాదించింది, వీటిలో ఆప్షన్ 2 జనగామ, కామారెడ్డి జిల్లాలను కూడా కలుపుతుంది. ఈ ఆప్షన్లు వివిధ జిల్లాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించారు. తుది ఎలైన్‌మెంట్ ఖరారు కోసం విశ్లేషణ జరుగుతోంది. ఈ ప్రాజెక్టు హైదరాబాద్‌లోని రద్దీని తగ్గించడంతో పాటు, రీజనల్ రింగ్ రోడ్‌తో సమన్వయంతో కొత్త శివారు పట్టణాలు, పారిశ్రామిక జోన్ల అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఇది రాష్ట్రంలోని సామాజికఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేస్తూ, హైదరాబాద్‌ను ఒక ప్రపంచ స్థాయి నగరంగా మరింత బలోపేతం చేస్తుంది.

# యూత్ అధ్యక్షుడి కి శుభాకాంక్షలు తెలిపిన హరీశ్ రావు

**చేర్యాల, జూలై 19 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ బి.ఆర్.ఎస్ యూత్ అధ్యక్షులు కోమిరె కరుణాకర్ జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావు ఆశీస్సులు తీసుకున్నారు..ఈ సందర్భంగా హరీష్‌రావు కరుణాకర్ ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ...ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ నన్ను ఆశీర్వదించిన ఎమ్మెల్యే హరీష్ రావు కి ప్రత్యేక ధన్యవాదాలు అని, అలాగే శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు అని తెలిపారు..



# తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ లోగో ఆవిష్కరించిన మంత్రి గడ్డం వివేక వెంకటేస్వామి

**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక వెంకట్ స్వామి**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూలై 19 ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు అయిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ లోగోను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించారు. సోమాజిగూడ నివాసంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ లోగోతో పాటు జాతీయస్థాయిలో పురోగమి పత్ర కార్ సంగ్ లోగోను కూడా ఆవిష్కరించారు . తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పట్టణ మరియు గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ అసోసియేషన్ పనిచేస్తుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అస శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి మసాడే లక్ష్మీనారాయణ తెలిపారు . త్వరలోనే ఇందుకు సంబంధించిన కార్యాచరణను ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు




# యూత్ కాంగ్రెస్ బలోపేతానికి యువత కృషి చేయాలి

**సిద్దిపేట పవర్:**

కాంగ్రెస్ బలోపేతానికి యువత క్షేత్రస్థాయిలో కృషిచేయాలని అధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్ తెలిపారు. సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ బోమల్ల ప్రవీణ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లివెంకటేష్ ని కలిశారు, మిట్టపల్లి వెంకటేష్ బొమ్మల ప్రవీణ్ తో మాట్లాడుతూ సిద్దిపేటలో యూత్ కాంగ్రెస్ ను పటిష్టంగా చేయాలని, పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని తెలిపారు, కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వాటిని గడపగడపకు తిరిగి ప్రచారం చేసి స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల గెలుపు కోసమే కష్టపడాలని సూచించారువారితో యూత్ కాంగ్రెస్ నాయకులు ముక్క బాబు, బుర్క సందీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నాకు స్ట్రెయిట్ ఫైట్ తప్పా... స్ట్రీట్ ఫైట్ రాదు

- మీదికి ఒక మాట.. లోపల ఒక మాట మాట్లాడటం రాదు
- కాలం చాలా గొప్పది
- బాజప్తా మాట్లాడతా.. బేజాప్తా మాట్లాడటం రాదు
- హుజురాబాద్ చైతన్యానికి మారుపేరు : ఈటల

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**



మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాకు స్ట్రెయిట్ ఫైట్ తప్పా స్ట్రీట్ ఫైట్ రాదు అని, మీదికి ఒక మాట, లోపల మరో మాట మాట్లాడటం నాకు అలవాటు లేదన్నారు. బాజప్తా మాట్లాడతా.. బేజాప్తా మాట్లాడటం రాదు అని ఆయన అన్నారు. రాజకీయాల్లో అవమానాలు, అవహేళనలు ఉంటాయి, వాటిని తట్టుకున్నా. 2021 నుండి BRS లో నరకం అనుభవించా. ప్రజలు ఎప్పుడూ మోసం చేయరు అని ఆయన వ్యాఖ్యానించారు.

అలాగే.. శత్రువుతో నేరుగా కొట్లాడతా. కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించుకోవడం రాదు. సైకో, శాడిస్ట్ ఎవడో.. ఎవరి అండతో ధైర్యం చేశాడో.. బీ కేర్‌ఫుల్ బిడ్డా అంటూ తన అనుభవాన్ని స్పష్టం చేశారు.

అంతేకాకుండా.. "హుజురాబాద్‌లో గత 20 ఏళ్లుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోలేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో BRSకి 53 వేల మెజార్టీ వచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నా అడుగు పడని పల్లె లేదు. నా చరిత్ర ఏంటో ప్రజలకు తెలుసు. ధీరుడు వెనుదిరగడు.. ఎంత వరకు ఓపిక పట్టాలో నాకు తెలుసు," అని హుజురాబాద్ తన బలమైన కోట అని పేర్కొన్నారు.

అలాగే, "కార్యకర్తల ఆవేదన అర్థమైంది. కార్యకర్తలకు రాజకీయ అవసరాలు తీర్చలేనంత నిస్సహాయంగా లేను. నా అనుభవం వాడుకుంటే పార్టీకి ఉపయోగపడుతుంది. పదవులే పరవధిగా భావించే వాడిని కాదు. ఏ పార్టీలో పనిచేస్తే ఆ పార్టీకి అంకితభావంతో పనిచేస్తా," అని చెప్పారు.

తన భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ, "పదిరోజులకు ఒకసారి హుజురాబాద్ వస్తా. నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో ఆఫీస్ ఉంటుంది. కార్యకర్తలు కుంగిపోవద్దు. హుజురాబాద్ వస్తా.. మీ వెంటే ఉంటా.. మిమ్మల్ని గెలిపించుకుంటా," అని స్పష్టం చేశారు.

అదే విధంగా, "కొత్త, పాత వాళ్లు అనే భావన లేదు. ఎవరి దయాదక్షిణ్యాలు అవసరం లేదు. కోవర్టులు రాజకీయాల్లోనే కాదు అన్నింట్లో ఉంటారు.. వారి గురించి బాధపడకండి. కురుస స్వభావులు.. మిమ్మల్ని చూసి నవ్వాలో, ఏడవాలో తెలియడం లేదు," అని వ్యాఖ్యానించారు.

# ఓరుగల్లు 40 ఏళ్ల కల సాకారమైంది..

- ఓరుగల్లు అభివృద్ధికి 3 యూనిట్లు – కిషన్ రెడ్డి హామీ
- "మోడీ గ్యారంటీ తప్పకుండా నెరవేరుతుంది" – వరంగల్ ప్రాజెక్టుల వివరాలు
- ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ 2026లో ప్రారంభం – అశ్వినీ వైష్ణవ్

**హైదరాబాద్ జూలై 19(సిద్దిపేట పవర్):**



కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతమిచ్చే ప్రాజెక్టులను ప్రకటించింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వరంగల్, ఖాజీపేట అభివృద్ధి ప్రణాళికలను వివరించారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, "40 ఏళ్ల ఓరుగల్లు వాసుల కలను సాకారం చేశాం. వ్యాగన్ తయారీ, కోచ్‌ల తయారీ, ఓవర్ హాలింగ్ కోసం మూడు యూనిట్లు మంజూరు చేశాం. దీని ద్వారా 3వేల మందికి నేరుగా ఉపాధి కలుగుతుంది. ఓరుగల్లు అభివృద్ధి కోసం కేంద్రం ఎన్నో నిధులు కేటాయించింది. మోడీ గ్యారంటీ అంటే తప్పకుండా నెరవేరుతుంది" అని అన్నారు.

అలాగే, "వేయి స్తంభాల మంటపం, రింగ్ రోడ్ నిర్మాణం పూర్తి చేశాం. త్వరలో వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ కూడా వస్తుంది. మోడీ వరంగల్‌కు ఏం ఇచ్చారో వరంగల్‌కి వచ్చి చూసి మాట్లాడాలి. వరంగల్ అభివృద్ధి, తెలంగాణ అభివృద్ధి పట్ల బీజేపీ ఎల్లప్పుడూ కమిట్మెంట్‌తో ఉంది" అని స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, "ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఎన్నో ఏళ్ల కల. ప్రధానమంత్రి మోడీ ఆ కలను సాకారం చేశారు. డిసెంబర్ నాటికి సివిల్ కన్స్ట్రక్షన్ పూర్తవుతుంది. 2026లో మాన్యుఫాక్చరింగ్ ప్రారంభమవుతుంది. ఇంజన్లు, బోగీలు, మెట్రో ట్రైన్స్ తయారీ జరగనుంది. దేశంలో అతి పెద్ద మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌గా ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిలుస్తుంది" అని తెలిపారు.

మోడీ ప్రభుత్వం తెలంగాణలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, పరిశ్రమల విస్తరణ, రవాణా, రైల్వే సదుపాయాల మెరుగుదలకు అన్ని విధాలుగా మద్దతు ఇస్తుందని ఇద్దరు మంత్రులు హామీ ఇచ్చారు.

## అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైన " ముత్యం "

**సెప్టెంబర్ 5న అవార్డు అందజేత**

**దుబ్బాక, సిద్దిపేట పవర్ న్యూస్ జూలై 19 ప్రతినిధి:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2025 అంబేద్కర్ సీనియర్ దళిత నాయకులు ఆస ముత్యం ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటీ వారు ప్రకటించారు. అంబేద్కర్ సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బి.ఎస్.ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ ఆహ్వాన పత్రాన్ని హైదరాబాదులోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ బీసీ అండ్ మైనార్టీ ల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతిఏటా ప్రజా ఉద్యమకారులకు సంఘసేవకులకు రచయితలకు కవులకు మరియు స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు.ఈ సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన ఆంధ్రప్రదేశ్లోని తిరుపతిలో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. సౌత్ ఇండియాలోని ఆరు రాష్ట్రాలైన తెలంగాణ ఆంధ్రప్రదేశ్ కర్ణాటక కేరళ తమిళనాడు అండ్ పుదుచ్చేరి రాష్ట్రాల నుండి సుమారుగా 600 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్కు హాజరవుతారని తెలియజేశారు.నాకు ఈ అవార్డు ఎంపిక పత్రాన్ని అందజేసిన బి.ఎస్.ఏ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమండ్ల విష్ణు అవార్డ్ సెలక్షన్ కమిటీ మెంబర్ కుంభాల రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.





## బోనం ఎత్తిన మున్సిపల్ చైర్పర్సన్


**సిద్దిపేట పవర్:**

ఆషాడ మాసం సందర్భంగా సిద్దిపేట పట్టణ 34వ వార్డులోని స్పైస్ వరల్డ్ స్కూల్ వారు నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొని బోనం ఎత్తిన సిద్దిపేట మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి కడవేరుగు మంజుల రాజనర్సు విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ గుడాల సంధ్యశ్రీకాంత్,పాఠశాల ప్రిన్సిపాల్ గుండ్ల రవి,శ్రీకాంత్,ట్రెస్మా ప్రెసిడెంట్ నరేష్, పాఠశాల ఉపాధ్యాయులు నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ప్రకృతి ప్రేమికుడు వనమోత్సవ సైనికుడు ఆరుట్ల లింగం

**సిద్దిపేట పవర్ చేర్యాల జులై 19** పద్మశ్రీ అవార్డు అందుకున్న వనజీవి రామయ్య అడుగుజాడలో ప్రకృతి ప్రేమికుడు, వనమోత్సవ సైనికుడు ఆరుట్ల లింగం కడవేరుగు లో 2018 నుంచి ఇప్పటివరకు నర్సరీని బలోపేతం చేస్తూ గ్రామానికి లక్ష మొక్కలు కొన్ని నాటాడు, గ్రామానికి సప్లై చేశాడు. అదేవిధంగా నర్సరీ నీ పార్కును, కరువు పనిని బలోపేతం చేస్తూ గ్రామ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రభుత్వాల నుండి వచ్చిన పథకాలను, సమాచారాలను ప్రజలకు అందిస్తూ ఉచిత సేవ చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఆరుట్ల లింగం గ్రామస్తులు అభినందించారు గ్రామాలలో గాని పట్టణాలలో గాని ప్రతి ఒక్కరూ ఒక మొక్క




పద్మశ్రీ అవార్డు అందుకున్న వనజీవి రామయ్య
అడుగుజాడలో పకృతి ప్రేమికుడు, వనమోత్సవ సైనికుడు









## జర్నలిజం వృత్తి కాదు అది ఒక సామాజిక బాధ్యత








- **జిల్లా కలెక్టర్ హైమవతి**
- **తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి.**

**సిద్దిపేట పవర్ ప్రతినిధి:**

ప్రజలకు, ప్రభుత్వానికి వారధి లాంటి వారు ప్రింట్ అండ్ ఎలెక్ట్రానిక్ మీడియా అని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి అన్నారు. సోమవారం విపంచి కళా వేదిక లో మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా జర్నలిస్టులకు రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందరికీ అందేలా కృషి చేస్తామని చెప్పారు. అదే విధంగా మీడియా పక్షాన తమ వంతు సహకారం అందించాలని కోరారు. అదే విధంగా జర్నలిజం వృత్తి కాదు అది ఒక సామాజిక బాధ్యత అన్నారు.

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక యుగంలో జర్నలిజం చరిత్రాత్మకమైన మార్పు లు వస్తున్నాయని పేర్కొన్నారు. నైతిక నియమావళి, మీడియా చట్టాలు అనే అంశంపై ప్రసంగించారు. వాస్తవాలు ప్రజా ప్రయోజనం జరిగితే తప్ప బాబా సాహెబ్ అంబేద్కర్ తో పాటు రాజ్యాంగ సభ్యులు ఆశించారో అదే భావన తో జర్నలిస్టులు పని చేయాలన్నారు. వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని ఆయన తెలిపారు, సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తలు సేకరణ సులభం అవుతుంది తెలిపారు, పాఠకుల వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వార్తలు ఉండాలని, తెలుగు వార్తలను సులువైన భాషలో వ్రాయాలని సూచించారు.

ప్రముఖ సంపాదకులు కే. శ్రీనివాస్ మాట్లాడుతూ, జర్నలిజం గతం వర్తమానం భవిష్యత్తు మీడియా ధోరణులు , యాధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్ లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లో వెళ్తున్నాయని తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ ఉడుముల సుధాకర్ మాట్లాడుతూ, ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు ఎలా వైరల్ అవుతాయో వివరించారు.

సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ, నేర వార్తల సేకరణ లో తీసుకోవలసిన జాగ్రత్తలు ,చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని చేసుకుని వ్రాయాలని ఆయన సూచించారు, అలాగే నేర వార్తలు లలో చేయాల్సినవి చేయకూడనివి అంశాలపై క్లుప్తంగా వివరించారు.

జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం అమలు తీరును వివరించారు. అందరికి ఉపాధి నీ కల్పించాలనేదే ఈ పథకం ఉద్దేశం అన్నారు. ఇప్పుడు ఈ పథకం అమలుకు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వర్క్లు కేటాయిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు సర్టిఫికెట్ లను ప్రధానం చేయడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ సెక్రటరీ ఎన్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## నేటి తో 25 వ కుటుంబానికి సాయం

**ఆపదలో తన వంతు సాయం చేస్తున్న జంగిటి బిక్షపతి**

**చేర్యాల, జూలై 19 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ నాయకులు జంగిటి బిక్షపతి, మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎవరూ చనిపోయిన తన వంతుగా దశదిన కర్మ రోజు 25 కిలోల బియ్యాన్ని అందిస్తాడు..ఈరోజు సొల్లు లచ్చమ్మ కుటుంబానికి 25 కిలోల బియ్యాన్ని అందించారు..ఈ సందర్భంగా జంగిటి బిక్షపతి మాట్లాడుతూ నాకు ఉన్నదాంట్లో మా వారికి సాయం చేస్తూ ఉంటానని ఇది వారికి ఎంతో కొంత సహాయపడుతుంది అని తెలిపారు.సొల్లు లచ్చమ్మకుటుంబ సభ్యులు బిక్షపతి కి కృతజ్ఞతలు తెలిపారు.. కార్యక్రమంలో పుల్లని నారాయణ,ముచ్చాల మైశయ్య, మల్లమారి నవీన్, ముచ్చాల వంశీ, ఎర్రోళ్ల అఖిల్, చింటూ తదితరులు పాల్గొన్నారు

## కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట పవర్, సిద్దిపేట బ్యూరో :** హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను రాష్ట్ర బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు హుస్నాబాద్ మండల , మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్ లో ఉన్న 25 మందికి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా మంత్రి హుస్నాబాద్ నియోజకవర్గంలో అన్ని మండలాల్లో వెంట వెంటనే కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు ఇవ్వడం జరుగుతుంది పెళ్లి చేసుకున్న వెంటనే ఆధారాలతో సహా సంబంధిత అధికారి వద్ద అప్లై చేసుకోవాలి అని చెప్పారు . అప్లై చేసుకున్న వెంటనే చెక్కులు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు ప్రభుత్వంలో కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులకు ఆటంకం లేకుండా పేమెంట్ చేస్తున్నాం అని చెప్పారు భవిషత్ లో కూడా కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు ఆలస్యం కాకుండా వెంట వెంటనే చెక్కులు పంపిణీ చేస్తాం.. ఎక్కడ కూడా పెండింగ్ లో లేవు అని చెప్పారు మండల ,పట్టణానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి చెక్కులు లబ్ధిదారులకు అందించడం జరిగిందని అన్నారు



## ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో చొక్కారావు గారు చిరస్మరణీయం

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**సిద్దిపేట బ్యూరో:**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో చొక్కారావు గారు చిరస్మరణీయం అని రాష్ట్ర బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు కరీంనగర్ పట్టణంలో మాజీ మంత్రి చొక్కారావు జయంతి సందర్భంగా వారి విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,ఇతర ముఖ్య నేతలు నివాళులు అర్పించారు .చొక్కారావు జయంతి సందర్భంగా వారితో ఉన్న స్మృతులను మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు జిల్లా పరిషత్ చైర్మన్ గా ,రాజకీయాల్లో ఆదర్శంగా తీసుకోవాల్సిన నేత అని అన్నారు నీతికి నిజాయితీకి మారుపేరు గా చొక్కరావు గారు జిల్లా రాజకీయాల్లో చిరస్థాయి గా నిలిచిన వ్యక్తి అని అన్నారు 1957 ప్రాంతంలో రవాణా శాఖ మంత్రి అయితే నేను వారి శిష్యుడిగా రాజకీయాల్లో ఇప్పుడు రవాణా శాఖ మంత్రి గా వ్యవహరిస్తున్న అని అన్నారు ఎల్ ఎం డి లో ఉన్న రవాణా శాఖ కార్యాలయం లో అక్కడ ఉన్న ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ కి వారి పేరు పెట్టుకోవడం జరిగింది అని చెప్పారు రాజకీయాల్లో ఒక నితిబద్దత కలిగిన చొక్కారావు గారు ఉన్నారు..వారి దగ్గర రాజకీయం నేర్చుకోవడం గర్వంగా భావిస్తున్నాం అని అన్నారు ఈనాటి యువత చొక్కా రావు లాంటి రాజకీయ నాయకుల చరిత్ర తెలుసుకొని ప్రజా సమస్యల పై ఏవిధంగా లీనమై నాయకులుగా ఎదగాలి వారి జీవిత చరిత్ర చూస్తే అర్థం అవుతుంది అని అన్నారు రాజకీయాలు ఆర్భాటానికి పరిమితమైన పరిస్థితి ఉంది.. త్వరగా ఉన్నత పదవులకు వెళ్లాలని రాజకీయాలు జరుగుతున్నాయి. కానీ దీర్ఘకాలిక రాజకీయాలు చేయాలంటే చొక్కారావు గారిని చూసి నేర్చుకోవాలి అని ఆయన పేర్కొన్నారు నేటి యువత కు వారి ఆశీర్వాదం వారి ఆలోచన విధానం ఉండాలి అని అన్నారు







## లేబర్ ఇన్సూరెన్స్ ను సద్వినియోగం చేసుకోవాలి

**బిజెపి మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజవర్గ ప్రతినిధి జులై:19**

గజ్వేల్ మండలం రిమ్మనగూడ బిజెపి గ్రామ శాఖ మిత్రులు మండల ఉపాధ్యక్షులు భీం కూమార్, బుతు అధ్యక్షులు గుడారం నవీన్ కూమార్, పాపనగారి శ్యాం కుమార్ లు వారి గ్రామ ప్రజలకు సోంత ఖర్చులతో నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ పథకం అయిన లేబర్ ఇన్సూరెన్స్ కార్యక్రమంను ప్రారంబిచిన మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బడుగు బలహిన వర్గల ప్రజల కోసం వారికీ ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబంకు ఆసారగా ఉంటుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకం లేబర్ ఇన్సూరెన్స్ అని ఈ పథకం ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ ఎల్కంటి సురేష్, మండల ప్రధానకార్యదర్శిలు ఇప్ప స్వామి, బారు అరవింద్, రిమ్మనగూడ శక్తి, కేంద్ర ఇన్చార్జి షణ్ముఖ గౌడ్, బిజెవైయం మండల కార్యదర్శి చందు, నర్సింలు, నవీన్ తది




## సెయింట్ పీటర్స్ టాలెంట్ స్కూల్లో బోనాలు పండుగ

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజవర్గ ప్రతినిధి జులై:19**

తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రసిద్ధి చెందిన బోనాల జాతర మహోత్సవాన్ని సిద్ధిపేట జిల్లా గజ్వేల్ తూప్రాన్ రోడ్డు గల సెయింట్ పీటర్స్ టాలెంట్ స్కూల్లో బోనాలు పండుగ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు విద్యాసంస్థల ఉపాధ్యాయుడు ప్రిన్సిపాల్ ఫాదర్ ఫిలిక్స్, రజిని కరస్పాండెంట్ సేవియర్ జ్యోతి ప్రజ్వలన చేసి, అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... బోనాల పండుగ మతసామరస్యానికి ప్రతీక అని, ఈ పండుగ సమాజంలోని రుగ్మతలను, దుష్టశక్తులను తొలగించి అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో తరతరాలుగా వస్తున్న ఈ బోనాల సంప్రదాయం రోజురోజుకు మరింత వైభవోపేతంగా మారుతోందని, ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో వచ్చి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన "పండగ వచ్చిందే..బోనాలు చేసుకుందామే తుమ్మెద...మరియు "బోనం మన బోనం బంగారు బోనం...నృత్యాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా గోరింటాకు ఉత్సవాలు

**కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం**

సిద్ధిపేట పవర్ గజ్వేల్ నియోజవర్గ ప్రతినిధి **జులై:19** గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆషాడ మాసం సందర్భంగా గోరింటాకు మరియు హరితహారం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ డాక్టర్ డి. సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ... గోరింటాకు భారతీయ సమాజంలో ఎంతో ప్రాధాన్యత ఉందని ఇది సాంస్కృతిక ఐక్యతకు దోహదం చేస్తుందని, అలాగే గోరింటాకు పెట్టుకోవడంలో శాస్త్రీయత ఉంటుందని దానివల్ల వర్షాకాలంలో వచ్చే వైరస్ బ్యాక్టీరియా వ్యాధులను గోరింటాకు అడ్డుకుంటుందని, మంచి ఔషధ గుణాలు కలిగిన గోరింటాకుకు అందుకే భారతీయ సాంప్రదాయంలో అధిక ప్రాధాన్యత ఉందని తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల ఆవరణలో విద్యార్థినీలు, అధ్యాపకులు మొక్కలను నాటి హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ కమలా క్రిస్టియాన, డాక్టర్ జె. ఉమారాణి, ఐక్యుఏసి కన్వీనర్ ఎం ఎం లక్ష్మి, కస్తూరిబాయ్ శ్రీలత, డాక్టర్ సరోజన, డాక్టర్ శోభారాణి, డాక్టర్ శ్రీలత, ఉమారాణి, డాక్టర్ జ్యోతి, వీరయ్య, డాక్టర్ బి. మురళీధర్, డాక్టర్ బాలచంద్రం, రమణారెడ్డి, ఇతర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పెద్ద ఎత్తున విద్యార్థినులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా అధికారి నూతనగా భాద్యతలు చేపట్టిన డాక్టర్ దాన్ రాజ్ ని సన్మానంచిన డాక్టర్ల బృందం

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

డాక్టర్ల బృందం సిద్దిపేట జిల్లా వైద్యాధికారి నూతనంగా భాద్యతలు చేపట్టిన డాక్టర్ డి యంహెచ్ ఓ ధనరాజ్ ని శాలువాతో ఘనంగా సన్మానిచారు. ఈ కార్యక్రమం లో టీపీహెచ్ డి జిల్లా ప్రసిడెంట్ డాక్టర్ సత్యప్రకాష్, రాధాకిషన్ సెక్రటరీ, రాజశేఖర్ ప్రధాన కార్యదర్శి తదితరులు ఉన్నారు.



# మేడారం ఆధునీకరణ

**సిద్దిపేట పవర్ తెలంగాణ బ్యూరో:**



భక్తుల సౌకర్యార్థం, పూజారుల కోరిక మేరకు మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయంలో ఆధునీకరణ పనులు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. సచివాలయంలో శనివారం ఆదివాసి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన మేడారం ఆలయ ప్రాంగణ ఆధునీకరణపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**గద్దెల్లో మార్పులుండవు..**

సమ్మక్క, సారలమ్మ గద్దెల్లో ఎలాంటి మార్పులు చేయకుండా, ఆలయ ఆవరణలో చేపట్టాల్సిన ఆధునీకరణ పనులపై మంత్రి పలు సూచనలు చేశారు. జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆలయ పరిసరాల్లోనే ఆధునిక వసతులను అభివృద్ధి చేయాలని, ఆదివాసుల సాంప్రదాయాలు, తల్లుల ధైర్యసాహసాలు ప్రతిబింబించేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని సూచించారు.

**జంపన్న వాగు అభివృద్ధికి రూ.5 కోట్లు..**

జంపన్న వాగు అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరయ్యాయని, భక్తుల సౌలభ్యం కోసం ఘాట్లను నిర్మిస్తామని మంత్రి తెలిపారు. వారం రోజుల్లో గద్దెల చుట్టూ ఆధునీకరణ పనులకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేసి, పూజారుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రతి దశలో వారి అభిప్రాయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**భక్తులకు పూర్తి వసతులు..**

భక్తులు బస చేసే ప్రాంతాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించి, వారు ఎలాంటి అసౌకర్యానికి లోను కాకుండా చూసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మేడారం విశిష్టతను నిలుపుకొంటూ, భక్తులకు అధునాతన సౌకర్యాలు కల్పించే దిశగా ఆధునికరణ పనులు ఉంటాయని స్పష్టం చేశారు. ఆధునికతతో పాటు ఆదివాసి సంప్రదాయాలను గౌరవించేలా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలను చాటే విధంగా, సమ్మక్క సారలమ్మ తల్లుల ధీరత్వాన్ని ప్రతిబింబించే విధంగా ఆలయ ప్రాంగణాన్ని, పరిసరాలను తీర్చిద్దుతామని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ జీ సృజన, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, మిషన్ భగీరథ ఎన్సీ కృపాకర్ రెడ్డి, గిరిజన సాంస్కృతిక శాఖ అధికారులు, సమ్మక్క సారలమ్మ జాతర పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ పూజారులు, ఆర్కిటెక్టులు, రంగ నిపుణులు పాల్గొన్నారు.



## అఖిల భారత జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు

**ముఖ్య అతిథిగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి**

సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజవర్గ ప్రతినిధి **జులై:19** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అఖిల భారత జర్నలిస్ట్ ఫెడరేషన్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్కూలు స్థాయి చెస్ కాంపిటీషన్ కు వివిధ పాఠశాల నుండి విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ జెడ్పిటిసి పంగ మల్లేశం హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యతో పాటు ఆటపాటలతోపాటు మేదస్సును పెంపొందించే ఆటగా వర్ణించడం జరిగింది. అంతేకాకుండా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నటువంటి ఏ బి జె ఎఫ్ మరియు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ మణికంఠకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ మణికంఠ, అకాడమిక్ ఇంచార్జ్ విజయ్ హరీష్ అఖిల భారత జర్నలిస్ట్ ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రాజలింగం, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ మైండ్ స్కూల్ లో ఘనంగా బోనాల పండుగ

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**

జగదేవపూర్ మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ స్కూల్ లో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ పట్లోల్లా రాఘవేంద్ర రెడ్డి,పాఠశాల కరస్పాండెంట్ పట్లొల్ల శ్రీ కిరణ్ రెడ్డి హాజరయ్యారు, అంతకు ముందు పోతురాజులు , బోనాలు విన్యాసాలు హైలైట్ గా నిలిచాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిక అయినా ఆషాడ మాసంలో జరుపుకునే ముఖ్యమైన పండుగ బోనాల పండుగ అని చెప్పారు. ఈ బోనాల పండుగను ఘనంగా జరపడానికి సహకరించిన పిల్లల తల్లిదండ్రులు మా పాఠశాల ఉపాధ్యాయులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమన్ని ప్రిన్సిపాల్ ప్రవీణ్ , షేకర్ గీత కీలక పాత్ర పోషించారని వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రు లు తదితరులు పాల్గొన్నారు.





## మల్లన్న ను దర్శించుకున్న బిజెపి న్యూఢిల్లీ సెంట్రల్ కోఆర్డినేటర్

**కొమురవెల్లి, జూలై 19 (సిద్దిపేట పవర్)**

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని బీజేపీ సెంట్రల్ కో ఆర్డినేటర్ నూనె బాలరాజు దర్శించుకోవడం జరిగింది..ఆయనకు సిద్దిపేట జిల్లా బిజెపి జనరల్ సెక్రెటరీ ఉమారాణి, సిద్దిపేట పేట జిల్లా ఉపాధ్యక్షులు బురుగు సురేష్ గౌడ్, కొమురవెల్లి మండల ప్రధాన కార్యదర్శులు పుట్ట కనకయ్య, ఎక్కల దేవి శ్రీనివాస్, రాజు చారి,బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నరెడ్ల నరేందర్ రెడ్డి, బీజేవైఎం కొమురవెల్లి మండల ప్రధాన కార్యదర్శి నరెడ్ల నరేందర్ రెడ్డి స్వాగతం పలికారు



## ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ మండలం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా బోనాల ఉత్సావాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో బోనలా పండుగ సంప్రదాయలకు ప్రతీక అన్నారు.ఆషాడ మాసంలో గ్రామ దేవతలను కొలవడం వల్ల ప్రజలు సుఖ సంతోషాలతో అష్ట ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వర్షాలు సమృద్ధిగా కురియాలని పడి పంటలు సమృద్ధిగా పండాలని అన్నారు.



## మెట్రో విస్తరణకు కృషి చేయాలి

- పార్టీలకతీతంగా సహకరించాలి
- కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు అవగాహన
- కేంద్ర అనుమతులపై ప్రత్యేక దృష్టి
- ఎంపీలకు రాష్ట్ర మంత్రులు పిలుపు
- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రజెంటేషన్

**సిద్దిపేట పవర్ తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణకు సంబంధించి కేంద్రం నుంచి త్వరితగతిన అనుమతులు పొందేందుకు రాష్ట్రానికి చెందిన ఎంపీలందరూ పార్టీలకతీతంగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ మెట్రో రైల్ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, మెట్రో రైల్ విస్తరణపై అవగాహన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం శనివారం నగరంలో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, జీ. వంశీ కృష్ణ, పీ బలరాం నాయక్, కుందూరు రఘువీర్, డాక్టర్ మల్లు రవి, ఆర్. రఘురామ్ రెడ్డి, సురేశ్ కుమార్ షెట్కర్, ఎం. అనిల్ కుమార్ యాదవ్. బీజేపీ నుంచి ఈటల రాజేందర్, ఎం. రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. మెట్రో రైల్ రెండవ దశ విస్తరణకు సంబంధించిన అంశాలపై మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఒక సమగ్ర ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర అభివృద్ధికి మెట్రో విస్తరణ అత్యవసరమని, దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడంలో ఎంపీలందరూ తమవంతు పాత్ర పోషించాలని కోరారు.

